క్లుప్తంగా

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీ



షాప్‌లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కోరుట్ల: పట్టణంలోని ప్లాస్టిక్ ఏజెన్సీలు, కిరాణ దుకాణాలు, హోటళ్లు, బేకరీల్లో శుక్రవారం మున్సిపల్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న వారికి జరిమానా విధించారు. బట్ట సంచులే వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

హరితహారం మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ



నర్సరీ పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

గొల్లపల్లి: హరితహారం కోసం నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి అన్నారు. గొల్లపల్లిలోని నర్సరీని శుక్రవారం సందర్శించారు. మొక్కల మొక్కల పెరుగుదలపై పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్‌రెడ్డి, ఎంపీవో సురేశ్‌రెడ్డి, లోకల్ కార్యదర్శి మధుసుధన్, టీఏ రాజేందర్ పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలి



మొక్కలు పరిశీలిస్తున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్

ఇబ్రహీంపట్నం: హరితహారానికి మొక్కలు సిద్ధం చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ ఆదేశించారు. మండలకేంద్రంలోని నర్సరీని శుక్రవారం ఆయన పరిశీలించారు. నర్సరీల్లో విత్తనాలు మొలకెత్తని చోట మళ్లీ నాటాలని సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు 2 పూటల నీళ్లు పట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఎంపీటీసీ తిమ్మణి రాములు, టెక్నికల్ అసిస్టెంట్లు వినోద్, ఫీల్డ్ అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ఆర్డీవో దంపతుల పూజలు



అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న ధర్మకర్తలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని పురాణిపేటలోని శ్రీలోకమాత పోచమ్మతల్లిని ఆర్డీవో నర్సింహమూర్తి దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నర్సింహమూర్తి దంపతులకు ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గాజుల రాజేందర్, రేపల్లె హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ అప్లికేషన్లకు స్పెషల్ డ్రైవ్



పెండింగ్ అప్లికేషన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ వీర్‌సింగ్

మల్లాపూర్: ధరణి పెండింగ్ అప్లికేషన్ల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ చేపట్టామని తహసీల్దార్ వీర్‌సింగ్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం దరఖాస్తులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 9 వరకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తోందన్నారు. దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణి, ఆర్‌ఐలు సురేశ్, రాజేశ్, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బస్‌షెల్టర్లు

శిథిలావస్థకు చేరిన వైనం

భయాందోళనలో ప్రయాణికులు



ప్రమాదకరంగా వెల్గొండ బస్ షెల్టర్

బుగ్గారం: ప్రయాణికుల సౌకర్యార్థం గతంలో వివిధ గ్రామాల బస్టాప్‌ల వద్ద నిర్మించిన బస్‌షెల్టర్‌లు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. వీటి నిర్వహణను ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో కూలిపోయే దశకు చేరుకున్నాయి. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఎండాకాలంలో, వర్షాకాలంలో వీటిలో ఉండి సేదతీరుతూ బస్సుల కోసం వేచిచూస్తుంటారు. అయితే ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అందులో వేచి ఉండాలంటేనే ప్రయాణికులు భయపడిపోతున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట్లలో నూతనంగా బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ధర్మపురి, బుగ్గారం మండలాల్లోని పలు ప్రాంతాల్లో నిర్మించిన బస్‌షెల్టర్లలో కొన్ని పూర్తిగా శిథిలావస్థకు చేరగా మరికొన్ని పగుళ్లు చూపుతున్నాయి. మండలంలోని వెల్గొండ ఎక్స్ రోడ్డు వద్ద జాతీయ రహదారి 63 పై గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బస్ షెల్టర్ వెనుక భాగం నుంచి వర్షాకాలం నీటి కాలువ ప్రవహిస్తుండడంతో పునాది భాగం పగుళ్లు చూపి ఎప్పుడు కూలుతుందో తెలియకుండా ఉంది. అలాగే నేరెళ్లలోని బస్‌షెల్టర్ గోడ పూర్తిగా పగుళ్లు చూపింది. బుగ్గారం మండలంలోని సిరికొండలో గల బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. వీటిని గమనించని అనేక మంది ప్రయాణికులు ఇందులోనే ఉంటూ బస్సుల కోసం వేచి చూస్తుండడంతో ఏదైనా పెను ప్రమాదం సంభవించే అవకాశాలున్నాయి. శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన ఇలాంటి బస్‌షెల్టర్‌లు జిల్లాలోని అనేక ప్రాంతాలలో ఉన్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన బస్‌షెల్టర్లను కూల్చేసి నూతన నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నేరెళ్ల వద్ద ప్రమాదకరంగా బస్‌షెల్టర్ గోడ

నూతన బస్టాప్‌లు నిర్మించాలి



వెల్గొండ స్టేజీ వద్ద గల బస్టాప్ కింద పునాది భాగం పగుళ్లు చూపి శిథిలమైపోయింది. దీనికి ఆనుకునే కాలువ ప్రవహిస్తుండడంతో తడిసి మరింతగా చెడిపోయింది. ఎప్పుడు కూలుతుందో తెలియకుండా ఉంది. అధికారులు స్పందించి నూతన బస్టాప్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– గాదె తిరుపతి, వెల్గొండ

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్/జగిత్యాలరూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హబ్సీపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చెటిపల్లి మోహన్‌రెడ్డితో పాటు వంగ రాజేశం, గంగాధర్, కొమ్ముల రంజిత్ రెడ్డి, లక్ష్మారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే సారంగాపూర్ మండలంలోని పోచంపేటకు చెందిన పలువురు తోపారపు రజనీకాంత్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ పల్లికొండ రమేష్, గంగపుత్ర సంఘం సభ్యులు 50 మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ముస్కు దామోదర్ రెడ్డి, జున్ను రాజేందర్, చెవుల గంగన్నలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన సింగిల్‌విండో చైర్మన్



నర్సింగరావు సమక్షంలో పార్టీలో చేరిన శ్రావణ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో సింగిల్ విండో చైర్మన్ బాస శ్రావణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సింగిల్‌విండో చైర్మన్ బాస శ్రావణ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌లో సింగిల్‌విండో చైర్మన్‌గా ఉన్నప్పటికీ గుర్తింపు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే సంజయ్ గ్రామానికి వచ్చినా పట్టించుకోవడం లేదని, కనీసం సమాచారం ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పొనకంటి వెంకటి, జెట్టి లింగం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ పట్టణాధ్యక్షుడిపై దాడి

కోరుట్ల: కోరుట్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు బింగి వెంకటేశ్(42)పై విత్తనాల నాగరాజు అనే వ్యక్తి కత్తితో బెదిరించి గాజు గ్లాసుతో తలపై గాయపర్చినట్లు ఎస్సై కిరణ్ తెలిపారు. పట్టణంలోని రాంనగర్ ఏరియాలో నివాసముండే బింగి వెంకటేశ్ శుక్రవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో విత్తనాల నాగరాజు అనే వ్యక్తి మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి వెంకటేశ్ ఇంటికి వెళ్లి కత్తితో బెదిరించి, గాజు గ్లాసు పగులకొట్టి తలపై గాయ పరిచినట్లు ఎస్సై తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

కథలాపూర్: మండలం తాండ్ర్యాల జెడ్పీ హైస్కూల్ పదోతరగతి విద్యార్థులకు స్థానిక యుకుడు గడ్డం రాకేశ్ పరీక్ష సామగ్రి శుక్రవారం అందించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడులు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం..

గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు 15 రోజులకు సరిపడేలా స్థానిక నాయకుడు రాచర్ల కృష్ణహరి అల్పాహారం సరుకులు అందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

రంగపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు..

సారంగాపూర్: మండలంలోని రంగపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తుండడంతో మండలంలోని కోనాపూర్‌కు చెందిన మర్యాల రాజన్న విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా రాజన్నను హెచ్‌ఎం సత్యనారాయణమూర్తి, నాయకులు అభినందించారు.

ప్రొటోకాల్ గురించి మాట్లాడే అర్హత లేదు

మెట్‌పల్లిరూరల్: ప్రొటోకాల్ గురించి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కు మాట్లాడే అర్హత లేదని మెట్‌పల్లి జెడ్పీటీసీ రాధ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. ఎమ్మెల్యే ప్రొటోకాల్ గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి వచ్చిన చెక్కులు, కమ్యూనిటీ హాల్ నిధుల మంజూరు పత్రాలు ఏ హోదా లేకున్నా ఎలా పంపిణీ చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పట్టణ, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాలటౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 8 శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 9 వ తేదీ ఉదయం 8గంటల వరకు జరిగే మహాదృఢ సంకల్ప శివగాన స్వరాభిషేకం పోస్టర్‌ను సాయి బాబా ఆలయంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి గాయకుడు నక్క రాజు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6న ఉదయం 11గంటలకు ఎంపీపీ మంగళారపు మహేశ్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు.

మేడిగడ్డకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు

కథలాపూర్: మేడిగడ్డ బ్యారేజీని సందర్శించేందుకు కథలాపూర్ మండలానికి చెందిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం వెళ్లారు కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్ రావు, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంగ్లిష్ పరీక్ష

మల్లాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతగా ముగిసింది. ఈ రోజు నిర్వహించిన తెలుగు పరీక్షకు మొత్తం 203 మంది విద్యార్థులకు 7గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి ఎం ఏ.కాలిక్, శాఖ అధికారి నర్సయ్య తెలిపారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

జగిత్యాల: మల్యాల మండలంలోని ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు స్థానిక రైతు వేదికలో శుక్రవారం పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వైద్యురాలు మౌనిక మాట్లాడుతూ ఈ నెల 3న 0–5 ఏళ్ల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి.లక్ష్మీ, డీపీఎంఒ ఇ.దేవీసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి వద్ద అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం ఉదయం పట్టణ ఎస్సై మన్మథరావు పట్టుకుని సీజ్ చేశారు. రాయికల్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అనుమతులు లేకుండా జగిత్యాలకు ఇసుక తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

పెగడపల్లి: ఊపిరితిత్తుల జబ్బుతో బాధపడుతున్న చిన్నారి వైద్యానికి మండలంలోని రాములపల్లి గ్రామస్తులు ఆర్థికసాయం అందించారు. గ్రామానికి చెందిన సుంకె మనెమ్మ–లచ్చయ్యల దంపతుల కుమారుడు ఊపిరితిత్తుల వ్యాధి బారిన పడటంతో ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిని గమనించి దీకొండ మహేందర్ అనే వ్యక్తి రాములపల్లి కుటుంబం పేర వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసి దాతలను సాయం చేయాలని కోరాడు. దీంతో వాట్సప్ గ్రూప్‌లో స్పందించిన దాతలు రూ.30 వేలు పంపించారు. ఈ డబ్బులను శుక్రవారం బాలుడి కుటుంబ సభ్యులకు గ్రామస్తులు అందజేశారు. కార్యక్రమంలో నంచర్ల మాజీ విండో చైర్మన్ లక్ష్మీనారాయణ, కడారి తిరుపతి, నీరటి రాజేందర్, జలుపతి పాల్గొన్నారు.

చెక్కు అందజేత

పెగడపల్లి: విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతు కుటుంబానికి విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం రూ. 5 లక్షల విలువ గల చెక్కును శుక్రవారం అందజేశారు. పెగడపల్లి మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి గ్రామానికి చెందిన నల్ల రాజిరెడ్డి అనే రైతు ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో విద్యుత్‌శాఖ నుంచి రూ. 5 లక్షల పరిహారం మంజూరైంది. చెక్కును మండల పరిషత్ కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు అధికారులు అందజేశారు. ఏడీఈ వరుణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, ఎంపీడీవో మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లు చీడపీడలపై అవగాహన

గొల్లపల్లి: వెల్గటూర్ మండలంలోని చెగ్యాం రైతువేదికలో శుక్రవారం వరిలో సోకే తెగుళ్లు, పీడపీడలపై వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రియదర్శిని, ఏఈవో ఫిర్దోస్, రైతులు తదితరులున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జగిత్యాల: తెలంగాణ డిగ్రీ,పీజీ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం హైదరాబాద్‌లో ఎన్నికైంది. జగిత్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల చైర్మన్ యాద రామకృష్ణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో పెద్దమ్మ తల్లి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా పట్నాలలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 5 లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎండీ. ఇబ్రహీం, మేడిపల్లి ఆనందరెడ్డి, మోత్కూరి ప్రసాద్, బొడిగం తిరుపతిరెడ్డి, బాస మహేశ్ తదితరులు ఉన్నారు.

వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

కోరుట్ల: రాష్ట్రంలో వయో వృద్ధుల సంక్షేమ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించడంపై తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. వయోవృద్ధుల రక్షణ, పోషణ, సంక్షేమ చట్టంపై శుక్రవారం కోరుట్లలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వయో వృద్ధులు తమ కొడుకులపై పెట్టిన కేసుల్లో కౌన్సెలింగ్ ఇచ్చారు. నిరాధరణకు గురవుతున్న తల్లిదండ్రులు ఆర్డీవోకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సెలింగ్ అధికారి సి. హన్మంత రెడ్డి, పబ్బా శివానందం, రాజ్ మోహన్, లక్ష్మీనారాయణ, సైఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్నవికాస్‌రావు, దీప

కథలాపూర్: మండం కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో కరీంనగర్‌కు చెందిన ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ప్రతిమ ఆస్పత్రి ప్రముఖ వైద్యులు చెన్నమనేని వికాస్‌రావు, దీప శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులకు తాగునీటికి ఇబ్బందిగా ఉందని వైద్యులు వికాశ్‌రావు దృష్టికి పాఠశాల కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. దీంతో రూ. 2.50 లక్షలు వెచ్చించి మోడల్‌స్కూల్‌లో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేశ్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలి



నియామక పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: బీజేపీ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ మండల కార్యాలయంలో మండల కార్యవర్గానికి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదిన్నర ఏళ్లుగా దేశం అన్నిరంగాల్లో అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు ముత్యాల చంద్రశేఖర్, గుయ్య మల్లేష్, లవంగ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు డ్రెస్సులు, బూట్లు పంపిణీ



దాతలు అందించిన సామగ్రితో విద్యార్థులు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తీగల మహేశ్ రెడ్డి, ఆర్‌ఎంపీ వైద్యుడు రాజేందర్ రూ. 40 వేల విలువ గల సామగ్రిని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అందజేశారు. తమ సొంత ఖర్చులతో స్పోర్ట్స్ డ్రెస్సులు, బూట్లు, టై, బెల్టులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఆలయ కమిటీ చైర్మన్ రాంచందర్ రావు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

పెగడపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. 112 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, సూపరింటెండెంట్ చక్రధర్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల్లో భోజనం చేయాలి

ఇబ్రహీంపట్నం: గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే భోజనం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ అన్నారు. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం లక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 7 నుంచి 3 ఏళ్ల పిల్లల వరకు టీహెచ్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ పంపిణీ చేశారు. పిల్లల బరువులు, ఎత్తు పరిశీలించారు. పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పీఈటీకి అభినందన

కోరుట్ల: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌లో పీఈటీగా పని చేస్తున్న సంగ మహేశ్‌కు ఎన్‌సీసీ స్టార్ బిరుదు పొందాడు. కరీంనగర్‌లో శుక్రవారం నైన్ తెలంగాణ బెటాలియన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు స్టార్ బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, డైరెక్టర్లు మహేశ్‌ను అభినందించారు.

అంబటి మల్లన్న ఆలయంలో ప్రభుత్వవిప్ పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

గొల్లపల్లి: ఎండపెల్లి మండలంలోని మారెడుపల్లి అంబటి మల్లన్నస్వామి ఆలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు జరిపారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు మల్లేశం, వెంకటస్వామి తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆర్‌ఎంపీ, పీఎంపీలు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్‌ఎంపీలు

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్, రూరల్ మండల ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిశారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ, పీఎంపీ సంఘ భవనానికి 10 గుంటల స్థలం కేటాయించామని, ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బూదారపు జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడు కొండబత్తిని గణేష్, కార్యదర్శి కోల మహేందర్, కోశాధికారి శ్రీనివాస రావు, లీగల్ అడ్వయిజర్ గోపి పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ఎమ్మెల్యే పూజలు

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ శుక్రవారం మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరంలోని ముక్తేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఉన్నారు. అనంతరం మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావుతో కలిసి మేడిగడ్డను సందర్శించారు.

కమనీయం.. కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీసీతా రామాంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో యంత్రమూర్తుల ప్రతిష్ఠ, హోమం, కల్యాణం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకుడు కృష్ణారావు స్వామివారిని దర్శించుకున్నారు.